ESHAGNA
ఛానల్‌కి సంబంధించిన Pvt Ltd ( Broadcasting ), MSME , Trademark , Food License (Fssai) , ISI License , RNI , Trust (12A-80G), రిజిస్ట్రేషన్ చేయబడును
RTMP సర్వర్ KEY, E పేపర్ వెబ్సైట్, న్యూస్ వెబ్సైట్ చేయబడును.

Registered No : APTEL/25/A1201

# గాయత్రి వార్తలు

జాతీయ తెలుగు దినపత్రిక



విలేకరులు కావలెను
గాయత్రి వార్తలు జాతీయ తెలుగు దినపత్రికలో ఆంధ్ర ప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాలలోని అన్ని నియోజకవర్గ, మండల కేంద్రాలలో పనిచేయుటకు ఆసక్తి గల విలేకరులు కావలెను. అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును
యం. నాగేశ్వర రావు
ఎడిటర్ గాయత్రి వార్తలు
సెల్: 73860 45673

PUBLISHED FROM : DELHI - MAHARASHTRA - ANDHRA PRADESH - TELANGANA - KARNATAKA - TAMILANADU - GOA - LOCKNOW - EDITOR : M. NAGESWARARAO

ప్రచురణ : ఆంధ్రప్రదేశ్ ఆదివారం 29-03-2026 సంపుటి : 1 సంచిక :280 ఎడిటర్ : యం నాగేశ్వరరావు పేజీలు : 4 వెల రు : 2/-


# ప్రధాని మోదీ, నేనూ
# చేతల మనుషులం: ట్రంప్

- ప్రధాని మోదీని, తనను తానూ “చేతల మనుషులు” గా ట్రంప్ అభివర్ణించారు.
- మాటల కంటే పనులకే తాము ప్రాధాన్యత ఇస్తామని ఆయన పేర్కొన్నారు.
- భారత్-అమెరికా మధ్య సంబంధాలు భవిష్యత్తులో మరింత బలోపేతం అవుతాయని ట్రంప్ ధీమా వ్యక్తం చేశారు.
- ఇటీవల జరిగిన ఫోన్ కాల్‌లో ఇరువురు నేతలు పశ్చిమాసియాలోని యుద్ధ వాతావరణంపై చర్చించారు.
- ముఖ్యంగా ప్రపంచ వాణిజ్యానికి కీలకమైన హార్ముజ్ జలసంధి తెరిచి ఉంచడంపై దృష్టి సారించారు.

2లో..



## ప్రమాదంలో సబ్‌సీ కేబుళ్లు..
## ఇంటర్నెట్ సేవలపై కేంద్రం ఆరా..!



2లో..

## పోలవరం జిల్లాలో మూడు పశువులను చంపిన పెద్దపులి



దేవీపట్నం: పోలవరం జిల్లాలో పెద్దపులి హడలెత్తిస్తోంది. దేవీపట్నం మండలం కొత్తవీధి వద్ద పశువులపై దాడి చేసింది. మూడు గేదె దూడలను పులి చంపేసింది. ఘటనాస్థలాన్ని అటవీ, పశు సంవర్ధక శాఖ అధికారులు పరిశీలించారు. సమీపంలోనే గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాల ఉండటంతో సిబ్బందిని అప్రమత్తం చేశారు. మునినిమిల్లి పరిసర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారుల సూచించారు.

## మరిన్ని ఎస్-400లు కొనుగోలు చేయనున్న భారత్..!

ఆపరేషన్ సిందూర్‌లో గగనతల రక్షణ వ్యవస్థ ఎస్-400 (ఎస్-400) సత్తా చాటిన విషయం తెలిసిందే. దీంతో వీటిని మరిన్ని కొనుగోలు చేసేందుకు భారత్ సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఈమేరకు నేడు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన జరిగే సమావేశంలో కీలక ప్రతిపాదనలను సమీక్షించి, పలు పెద్ద ప్రాజెక్టులకు క్లియరెన్స్ ఇచ్చే అవకాశం ఉంది. వీటిలో ఐదు ఎస్-400 క్షిపణి వ్యవస్థలతో పాటు..

2లో..



## సవాళ్ల సమయంలోనే నాయకత్వ పటిమ బయటపడుతుంది:



2లో

అమరావతి: పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకం తగ్గింపును ఏపీ స్వాగతిస్తోందని సీఎం చంద్రబాబు అన్నారు. సవాళ్ల సమయంలో నాయకత్వ పటిమ బయటపడుతుందన్నారు. క్లిష్టపరిస్థితుల్లో దేశానికి స్థిరత్వం కల్పిస్తున్న మోదీ నేతృత్వం దేశానికి ఓ వరమన్నారు. “ అనేక దేశాలు ఇంధన ధరల భారం ప్రజలపై మోపుతున్నాయి. భారత్ మాత్రం ప్రజా ప్రయోజనాలు దృష్టిలో పెట్టుకొని చర్యలు తీసుకుంటోంది. ఇది ఎన్డీయే ప్రభుత్వ ప్రజా ప్రాధాన్యానికి నిదర్శనం” అని చంద్రబాబు

## ఇక తెలంగాణ ఆడబిడ్డ పార్టీ

25న పార్టీ పేరును,జెండాను, ఎజెండాను ప్రకటిస్తా
మేడ్చెల్ మునీరాబద్ వేదికగా పార్టీని వెల్లడిస్తా
శ్రీరామనవమి రోజు కాబట్టి ప్రకటన చేస్తున్నా
తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత ప్రకటన




2లో

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత కీలక ప్రకటన చేశారు. ఏప్రిల్ 25న ఉదయం 10గంటలకు నూతన రాజకీయ పార్టీ స్థాపించబోతున్నట్లు వెల్లడించారు. మేడ్చల్ జిల్లా మునీరాబాద్‌లోని అధ్వయ కన్వెన్షన్‌లో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి పార్టీ ప్రకటన చేయబోతున్నట్లు చెప్పారు. అదే రోజు పార్టీ పేరు, జెండాను ప్రకటిస్తామన్నారు. శ్రీరామనవమి మంచి రోజు కాబట్టి ఇవాళ ప్రకటన చేస్తున్నట్లు చెప్పారు.

# అమరావతి చట్టబద్ధతపై తీర్మానం..
# సభలో ప్రవేశపెట్టిన సీఎం

రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పించాలని కోరుతూ తీర్మానం చేసేందుకు రాష్ట్ర శాసనసభ శనివారం ప్రత్యేకంగా సమావేశమైంది. ఉదయం సభ ప్రారంభం కాగానే.. తీర్మానాన్ని సీఎం చంద్రబాబు ప్రవేశపెట్టారు. తీర్మానాన్ని ఆమోదించాక కేంద్రానికి పంపనున్నారు.

స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ.. ఏపీకి శాశ్వత రాజధాని నిర్మాణం అవసరమని సీఎం చంద్రబాబు సంకల్పించారని చెప్పారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా నిర్ణయాలు మారకూడదన్నారు. అమరావతికి చట్టబద్ధత తీర్మానంపై సభలో చర్చ కొనసాగుతోంది.“గత పాలకులు రాజకీయ లబ్ధి కోసం రాష్ట్రాన్ని రెండుగా విభజించారు. విడిపోయాక రాష్ట్రానికి రాజధాని లేకుండా పోయింది. 2015 జనవరి 1న ల్యాండ్ పూలింగ్‌కు నోటిఫికేషన్ ఇచ్చాం.



# వైకాపా మళ్లీ రాదు..
# వచ్చినా ఏమీ చేయలేదు



రాష్ట్రాన్ని విభజించేటప్పుడు కాంగ్రెస్ బాధ్యతగా వ్యవహరించలేదని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. రాష్ట్రం ఏర్పడే నాటికి సరైన కార్యాలయాలు లేవని, చంద్రబాబు బలమైన ఆశావాది కాబట్టి.. కార్యాలయాలు లేకపోయినా టెంట్ వేసుకొనైనా పని చేద్దామని ఆశించారన్నారు. రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పించాలని కేంద్రాన్ని కోరే తీర్మానంపై చర్చ సందర్భంగా శాసనసభలో పవన్ మాట్లాడారు.“రాష్ట్రం ఏర్పడి ఇన్నేళ్లయినా..

## ఈ సమాజానికి వైకాపా హానికరం



రాష్ట్ర భవిష్యత్‌ను నాశనం చేసేలా గత వైకాపా ప్రభుత్వం 3 రాజధానుల నాటకమాడిందని ఏపీ మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. రాష్ట్రాన్ని జగన్ రాజకీయంగానే చూశారని మండిపడ్డారు. వైకాపా హయాంలో రాష్ట్రానికి ఒక్క పెట్టుబడి అయినా సాధించారా? అని ప్రశ్నించారు. రాజధాని అమరావతికి చట్టబద్ధత తీర్మానంపై చర్చ సందర్భంగా పయ్యావుల మాట్లాడారు. రాష్ట్రాభివృద్ధి కోసం చంద్రబాబు రాత్రింబవళ్లు కష్టపడుతున్నారని చెప్పారు. “అమరావతి రాజధాని కోసం రైతులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి భూములిచ్చారు. ఈ సమాజానికి వైకాపా హానికరమని ప్రజలంతా గుర్తుపెట్టుకోవాలి.

## వైజాగ్ స్టీల్ ప్రైవేటీకరణ చేసే పరిస్థితులు తలెత్తవు: శ్రీనివాస వర్మ



2లో

గాయత్రి వార్తలు
29-03-2026

# సంపాదకీయం

## ఆధునిక రాజ్యం, అనాది నాగరికతల యుద్ధం

ఇబ్న్ ఖల్దూన్, ముకద్దిమా (14వ శతాబ్దం)

2026, ఫిబ్రవరి 28 ఉదయం.. అమెరికా, ఇజ్రాయెల్ కలిసి ఇరాన్‌పై భారీ వైమానిక దాడులు చేశాయి. 12 గంటల్లో ఇరాన్‌లోని క్షిపణి కేంద్రాలు, అణుకేంద్రాలు, సైనిక స్థావరాలపై 900 సార్లు బాంబుల వర్షం కురిసింది. ఇరాన్ అత్యున్నత నాయకుడు అలీ ఖమేనీ కుటుంబంతో సహా ప్రాణాలు కోల్పోయారు. ఈ యుద్ధం రెండుమూడు రోజుల్లో ముగిసిపోతుందని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రకటించారు.

పాతిక రోజుల తర్వాత.. హోర్ముజ్ జలసంధి ఇంకా తెరుచుకోలేదు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ప్రమాదం అంచున నిలబడింది. 1970లలో వచ్చిన రెండు చమురు సంక్షోభాల కంటే ప్రస్తుత పరిస్థితి దారుణంగా ఉందని అంతర్జాతీయ ఇంధన సంస్థ ప్రకటించింది. ఇరాన్ నౌకాదళం నాశనమైనా, నాయకులు హతమైనా, అణుకేంద్రాలపై మూడుసార్లు దాడులు జరిగినా.. ఆ దేశం ఇంకా పాలన సాగిస్తోంది, పోరాడుతోంది. ఇప్పటికీ అంతర్జాతీయ చర్చల్లో తన నిబంధనలనే విధిస్తోంది.

మార్చి 22న ట్రంప్-- '48 గంటల్లోగా హోర్ముజ్ జలసంధిని తెరవకపోతే, ఇరాన్‌లోని పవర్ ప్లాంట్లను నాశనం చేస్తాం' అని తన 'ట్రూత్ సోషల్' వేదికగా ఒక వార్నింగ్ ఇచ్చారు. దీనికి ఇరాన్-- 'పర్షియన్ గల్ఫ్ మొత్తం మందుపాతరలతో నింపేస్తామని, చమురు కేంద్రాలన్నింటినీ ధ్వంసం చేస్తామ'ని గట్టిగా బదులిచ్చింది. తను ఇచ్చిన గడువు ముగియడానికి మరో 12 గంటలు ఉందనగా.. అమెరికా, ఇరాన్ మధ్య 'చాలా మంచి, ఉపయోగకరమైన చర్చలు జరిగాయని', అందుకే దాడులను ఐదురోజులు వాయిదా వేస్తున్నానని ట్రంప్ ప్రకటించారు. ఒక మహాసామ్రాజ్యం క్షిపణులను ప్రయోగించింది. ఒక పురాతన నాగరికత ఆ దాష్టీకాన్ని తట్టుకొని నిలబడింది. ఇది ఏడువేల ఏళ్ల చరిత్ర వర్సెస్ రెండువందల ఏళ్ల అధికారం!

ఇరాన్ పీఠభూమిలో 7,000 ఏళ్ల నుంచే మానవ ఆవాసం ఉంది. క్రీస్తుపూర్వం 3200 నాటికే అక్కడ ఒక గొప్ప నాగరికత విలసిల్లింది. క్రీస్తుపూర్వం 6వ శతాబ్దంలో 'సైరస్ ది గ్రేట్' పాలనలో పర్షియన్ సామ్రాజ్యం ప్రపంచంలోనే అతిపెద్ద శక్తిగా ఎదిగింది. గ్రీస్, ఈజిప్ట్, టర్కీ, ఇరాక్ నుంచి మన పక్కనే ఉన్న పాకిస్థాన్ వరకు అది విస్తరించింది. క్రీస్తుపూర్వం 539లో, యుద్ధం లేకుండానే బాబిలోన్‌ను సైరస్ జయించారు. అక్కడి ప్రజలే కోట తలుపులు తెరిచి ఆయనకు స్వాగతం పలికారు. ఆ సమయంలో సైరస్ తన ఆజ్ఞను ఒక స్తూపంపై రాయించారు. ప్రస్తుతం బ్రిటిష్ మ్యూజియంలో ఉన్న ఆ స్తూపాన్ని, 1971లో ఐక్యరాజ్యసమితి ప్రపంచంలోనే మొదటి మానవ హక్కుల ప్రకటనగా గుర్తించింది. ఆ సైరస్ స్తూపం ప్రకారం.. ఆయన బానిసలందరికీ విముక్తిని, మతస్వేచ్ఛను, సమానత్వాన్ని ప్రసాదించారు. హీబ్రూ బైబిల్‌లో యూదుడు కాని వ్యక్తిని 'మెస్సయ్య' (దేవునిచే ఎన్నుకోబడినవాడు) అని పిలిచారంటే అది కేవలం సైరస్‌ను మాత్రమే.

సైరస్ చక్రవర్తి మానవ హక్కుల పత్రాన్ని ప్రకటించిన 2,315 ఏళ్ల తర్వాత (1776లో) పుట్టిన అమెరికా.. ఇప్పుడు అదే నాగరికతను గగనతలం నుంచి నామరూపాలు లేకుండా చేయాలని చూస్తోంది. సైరస్ పత్రం వెలువడిన 2,487 ఏళ్ల తర్వాత (1948లో) ఏర్పడిన ఇజ్రాయెల్.. తన భద్రత పేరుతో ఆ నాగరికతను లొంగ దీసుకోవాలని ప్రయత్నిస్తోంది. పాతికరోజుల పాటు సాగిన ఈ వైమానిక దాడులు ఇరాన్ సుదీర్ఘచరిత్రలో ఒక చేదు అధ్యాయం మాత్రమే. కానీ, అమెరికాకు మాత్రం ఇలాంటి యుద్ధం ఊహకందని విషయం.

క్రీస్తుపూర్వం 330లో అలెగ్జాండర్ 'పెర్సెపోలిస్' నగరాన్ని తగులబెట్టాడు. 13వ శతాబ్దంలో మంగోలులు ఇరాన్ నగరాలపై విరుచుకుపడి, కొన్ని ప్రాంతాల్లో ముప్పావు వంతు జనాభాను ఊచకోత కోశారు. ఇక 1953లో బ్రిటన్ కుట్ర పన్ని, ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రధాని మొహమ్మద్ మొసాద్దెగ్‌ను గద్దె దించింది. 1980లో అమెరికా అందించిన ఆయుధాలతో ఇరాక్.. ఇరాన్‌పై ఎనిమిదేళ్ల పాటు సాగించిన యుద్ధంలో లక్షలాది మంది ఇరానీయులు బలయ్యారు. అయినా సరే, ఇరాన్ ఇంకా ఉంది. పర్షియా ఎప్పుడూ ఇక్కడే ఉంది.

## పులి మస్తాన్ వర్ధంతి: సేవా కార్యక్రమాలతో స్మరించిన నాయకులు

శ్రీకాళహస్తి, మార్చి 28, గాయత్రి వార్తలు:





శ్రీకాళహస్తి నియోజకవర్గానికి చెందిన దళిత నాయకుడు పులి మస్తాన్ 10వ వర్ధంతి సందర్భంగా పట్టణంలో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీకాళహస్తిలోని అంబేద్కర్ విగ్రహం వద్ద పులి మస్తాన్ చిత్రపటానికి పూలమాలలు వేసి పలువురు నాయకులు, కుటుంబ సభ్యులు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షుడు విజయ్ కుమార్ నాయుడు, దేవస్థానం మాజీ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, జై భీమ్ ఆర్మీ వ్యవస్థాపకుడు పులి శ్రీకాంత్ మరియు ఇతర నాయకులు పాల్గొన్నారు. అనంతరం పేదల కోసం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథుల చేతుల మీదుగా ప్రారంభమైన ఈ కార్యక్రమంలో భారీ సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన నాయకులు పులి మస్తాన్ సేవలను స్మరించుకుంటూ, ఆయన అన్ని వర్గాల ప్రజలతో సఖ్యతగా మెలిగి పేదల పక్షాన నిలిచిన వ్యక్తి అని కొనియాడారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తూ పులి శ్రీకాంత్ సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. సమాజంలో సోదరభావం పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు అవసరమని, సేవా భావంతో ముందుకు రావాలని నాయకులు పిలుపునిచ్చారు.

## రామనవమి వేళ అద్భుత దృశ్యం.. అయోధ్యరాముడికి 'సూర్యతిలకం'

మొదటిపేజీ తరువాయి

ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్య ఆలయం లో శ్రీరామనవమి వేడుకలు అంబరాన్నంటాయి. శ్రీరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ జరిగిన తర్వాత వచ్చిన మూడో శ్రీరామ నవమి ఇది. ఈ సందర్భంగా ఆలయంలో అద్భుత దృశ్యం ఆవిష్కృతమైంది. బాలరాముడి నుదిటిపై 'సూర్య తిలకం ' చూసి భక్తులు పరవశించారు. ఈ పండగ వేళ... స్వామి దర్శనం కోసం దేశవిదేశాల నుంచి భక్తులు పోటెత్తారు.

అయోధ్య ఆలయంలో గర్భగుడిలోని బాలరాముడి విగ్రహం నుదుటిపై సూర్యకిరణాలు పడేందుకు మూడో అంతస్తులో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పరిమిత సంఖ్యలో పైపులు, కుంభాకార, పుటాకార కటకాలతో ఒక వ్యవస్థను రూపొందించారు. ఆలయ శిఖర భాగంలో సూర్యకాంతి గ్రహించేందుకు ఒక పరికరాన్ని ఏర్పాటుచేశారు. అక్కడినుంచి పైపు లోపలికి కాంతి ప్రసరించి తిలకం వలే కన్పిస్తోంది. బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆస్ట్రోఫిజిక్స్(ఐఐఏ) శాస్త్రవేత్తలు,

పరిశోధకుల సాయంతో కేంద్ర భవన నిర్మాణ పరిశోధన సంస్థ(సీబీఆర్ఐ) శాస్త్రవేత్తలు దీనిని నిర్మించారు.

ప్రతి శ్రీరామనవమి రోజున..

ప్రతి శ్రీరామ నవమి రోజున బాలరాముడి నుదుటిపై ఈ తిలకం దిద్దేలా ఏర్పాట్లు చేశారు. అందుకోసం గడియారంలో ముల్లులు తిరిగేందుకు ఉపయోగించే పరిజ్ఞానం తరహాలో గేర్ టీత్ మెకానిజం వినియోగించారు. సూర్యకాంతిని గ్రహించే పరికరం వద్దే మరో పరికరం ఉంచారు. ఇది కాంతిని గ్రహించే అద్దాన్ని 365 రోజులు స్వల్పంగా కదుపుతూ ఉంటుంది. మళ్లీ శ్రీరామనవమి రోజు వారు అనుకున్న చోటుకు తీసుకొస్తుంది. అంతకుముందే ఏటా శ్రీరామనవమి వచ్చే కాలాన్ని అత్యంత కచ్చితత్వంతో గణించారు.

## మరిన్ని ఎస్-400లు కొనుగోలు చేయనున్న భారత్..!

మొదటిపేజీ తరువాయి

60 మధ్యశ్రేణి రవాణా విమానాలు కూడా ఉన్నాయి. త్రివిధ దళాల్లో ఆయుధ సామర్థ్యాలను మరింత బలోపేతం చేయడానికి ఈ చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది.

భారత వైమానిక దళం కోసం నాలుగు స్క్వాడ్రన్ల రిమోట్లీ పైలట్ స్ట్రైక్ ఎయిర్‌క్రాఫ్ట్‌లు, 800 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను ఛేదించగలిగే బ్రహ్మోస్ సూపర్‌సోనిక్ క్రూయిజ్ క్షిపణులను కొనుగోలు చేయాలన్న ప్రతిపాదనను సమీక్షించనున్నట్లు రక్షణ మంత్రిత్వశాఖకు చెందిన రక్షణ సేకరణ మండలి (డీఏసీ) వెల్లడించింది. ఆధునిక యుద్ధంలో విరివిగా డ్రోన్లు వినియోగిస్తుండడంతో.. భారత పదాతిదళ విభాగాలలో ప్రత్యేక డ్రోన్ రెజిమెంట్లు, ప్రత్యేక క్షిపణి దళాల ఏర్పాటు గురించి కూడా చర్చించనున్నారు

## ప్రధాని మోదీ, నేనూ చేతల మనుషులం: ట్రంప్

మొదటిపేజీ తరువాయి

భారత ప్రధాని నరేంద్రమోదీపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రశంసలు కురిపించారు . మోదీ, తానూ చేతల మనుషులమంటూ వ్యాఖ్యానించారు. అయితే ఈ మాట చాలామందికి వర్తించదన్నారు. భారత్‌తో బంధం రానున్న రోజుల్లో మరింత బలపడుతుందని ఆశాభావం వ్యక్తంచేశారు. ఈ ట్రంప్ మాటలను భారత్‌లోని యూఎస్ ఎంబసీ ఎక్స్ వేదికగా షేర్ చేసింది. పశ్చిమాసియా ఉద్రిక్తతలు ప్రపంచ దేశాలపై ప్రభావం చూపుతోన్న తరుణంలో అమెరికా నుంచి ఈ స్పందన వచ్చింది.ఇదిలాఉంటే.. రెండురోజుల క్రితం మోదీ కి ట్రంప్ ఫోన్ చేసిన సంగతి తెలిసిందే. పశ్చిమాసియాలో కొనసాగుతున్న పరిస్థితులపై ఇరువురు నేతలు చర్చించారు. హర్మూజ్ జలసంధిని తెరిచిఉంచాల్సిన ఆవశ్యకత పైనా చర్చించినట్లు భారత్‌లో అమెరికా రాయబారి సెర్గియో గోర్ 'ఎక్స్' వేదికగా వెల్లడించిన సంగతి తెలిసిందే. ఆ సంభాషణ గురించి మోదీ కూడా స్పందించారు. వీలైనంత త్వరగా ఉద్రిక్తతలను తగ్గించి, శాంతిని పునరుద్ధరించేందుకు భారత్ మద్దతు ఉంటుందని స్పష్టం చేసినట్లు పేర్కొన్నారు.

## శోభాయాత్రకు 3వేల మందితో బందోబస్తు: సీపీ సజ్జనార్

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: శ్రీరామ నవమి సందర్భంగా నగరంలోని వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న రాములోరి కల్యాణాలు, శోభాయాత్రలకు కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు హైదరాబాద్ సీపీ సజ్జనార్ తెలిపారు. నల్లకుంటలోని పాత రామాలయంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సీపీ మాట్లాడారు.

"నగరంలో దాదాపు 339 ప్రాంతాల్లో శ్రీరామ నవమి సందర్భంగా కార్యక్రమాలు జరుగుతున్నాయి. సీతారాంబాగ్ నుంచి హనుమాన్ వ్యాయామశాల వరకు సాగే శోభాయాత్రకు 3వేల మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశాం. అనుకున్న సమయానికి శోభాయాత్ర పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకున్నాం. ఇతర పండుగలకు ప్రజలు సహకరించిన విధంగానే శ్రీరామ నవమి ఉత్సవాలు ప్రశాంతంగా ముగిసేలా అందరూ సహకరించాలి" అని సజ్జనార్ కోరారు.

## ప్రమాదంలో సబ్‌సీ కేబుళ్లు.. ఇంటర్నెట్ సేవలపై కేంద్రం ఆరా..!

పశ్చిమాసియాలో కొనసాగుతోన్న ఉద్రిక్తతల నేపథ్యంలో హర్మూజ్‌లోని కేబుళ్లను ఇరాన్.. ఎర్ర సముద్రంలోని బాబ్ అల్ మందేబ్ జలసంధిలోని సముద్రగర్భ కేబుళ్లను హూతీలు టార్గెట్ చేసే అవకాశం ఉన్నట్లు పలు దేశాలు ఆందోళన వ్యక్తంచేస్తున్నాయి. వీడియో కాల్స్, ఈమెయిల్స్, బ్యాంకింగ్ లావాదేవీలు, ఏఐ సర్వీసులు వంటివి కొనసాగించడానికి ప్రపంచ ఇంటర్నెట్‌కు ఈ కేబుళ్లు అత్యంత కీలకమైనవి. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం సబ్‌సీ కేబుల్ ఆపరేటర్లు, టెలికాం కంపెనీలకు కీలక ఆదేశాలు జారీ చేసింది.

సముద్ర కేబుళ్లలో అంతరాయం ఏర్పడితే భారత్‌కు కలిగే నష్టాన్ని అంచనా వేసి, అందుకు తగిన ప్రణాళికలు రూపొందించాలని కేంద్ర టెలికాం కంపెనీలను, సముద్రగర్భ కేబుల్ ఆపరేటర్లను కేంద్రం కోరినట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి. ఈ మేరకు డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలికమ్యూనికేషన్స్ పలు కంపెనీల ప్రతినిధులతో సమావేశం అయినట్లు తెలిపాయి. భారత్ నుంచి అమెరికా, యూరప్‌లకు వెళ్లే డేటా ట్రాఫిక్‌లో దాదాపు మూడింట ఒక వంతుకు హర్మూజ్ జలసంధి ఒక కీలక మార్గంగా ఉందని అధికారులు పేర్కొన్నారు. దానిలో కొంత ట్రాఫిక్‌ను సింగపూర్ మీదుగా మళ్లించగలిగినప్పటికీ ఆ సామర్థ్యం పరిమితంగా ఉందన్నారు.

ఇంధన ఆందోళనల వేళ.. 'లాక్‌డౌన్'పై క్లారిటీ ఇచ్చిన కేంద్రం

అంతేకాకుండా దీనికి అయ్యే ఖర్చు కూడా ఎక్కువని తెలిపారు. పసిఫిక్‌ను ప్రత్యామ్నాయ మార్గంగా తీసుకున్నా అది సుదీర్ఘంగా ఉండడం వల్ల డేటా ప్రాసెసింగ్ వేగం నెమ్మదిస్తుందన్నారు. సముద్రగర్భ మౌలిక సదుపాయాల భద్రతను నిర్ధరించడానికి ఇరాన్‌తో దౌత్య చర్చలు జరపాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. దాడుల వల్ల సముద్రంలోని అంతర్నిర్మిత నెట్‌వర్క్ కేబుళ్లు పూర్తిగా ధ్వంసమయ్యే అవకాశం లేదని భారతీయ సమాచార

## ఇక తెలంగాణ ఆడబిడ్డ పార్టీ

మొదటిపేజీ తరువాయి

యువత, మహిళలకు మా పార్టీలో మంచి స్థానం ఉంటుంది. ఇన్నాళ్లూ మగవాళ్లు ఏర్పాటు చేసిన పార్టీలను చూశారు. తెలంగాణ ఆడబిడ్డగా నేను పార్టీ పెడితే ఎలా ఉంటుందో మీరే చూస్తారని అన్నారు. ఈ మేరకు నూతన రాజకీయ పార్టీపై గతకొంతకాలంగా వస్తున్న ఊహాగానాలకు తెరదించుతూ తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత కీలక ప్రకటన చేశారు. ఏప్రిల్ 25న ఉదయం 10 గంటలకు కొత్త పార్టీని స్థాపించనున్నట్లు తెలిపారు. మేడ్చల్‌లోని మునీరాబాద్ వద్ద అద్వయ ఫంక్షన్ హాలులో జెండా ఆవిష్కరణ చేస్తామని ప్రకటించారు. ఆ సమయంలోనే పార్టీ పేరును కూడా ప్రకటించనున్నట్లు తెలిపారు. కార్యకర్తలంతా సమయానికి చేరుకోవాలని, ప్రతి గ్రామం నుంచి తరలి రావాలని కవిత పిలుపునిచ్చారు. జయశంకర్ పేరు పెట్టుకుంటామని చెప్పారు. యువతకు, మహిళలకు ప్రాధాన్యం ఇస్తామని వెల్లడించారు. ఆడబిడ్డల్లో మార్పు తేవడానికి ఒక ఆడబిడ్డగా ఈ పార్టీని పెడుతున్నానని తెలిపారు. బీసీ బిల్లు సాధించడం తమ వల్లనే సాధ్యమవుతుందని అన్నారు. బీసీలు, దళితులు, గిరిజనులు, మైనారిటీలు తరలిరావాలని కవిత పిలుపునిచ్చారు. తెలంగాణ రాజకీయాలను శ్రీరాముడి స్ఫూర్తితో గమనించాలని కవిత అన్నారు. 'నేను నిజామాబాద్ బిడ్డను.. నిజామాబాద్ మట్టి మంచిది.. ఇక్కడ తీసుకునే ఏ నిర్ణయమైనా సక్సెస్ అయింది' అని తెలిపారు. నీళ్లు, నిధులు, నియామకాలు సంపూర్ణంగా సాధించలేకపోయామన్నారు. రోజూ ప్రజల అవస్థలు చూస్తున్నామని కవిత వ్యాఖ్యానించారు. కచ్చితంగా ఒక కొత్త రాజకీయ పార్టీ రావాల్సిన అవసరం ఉందన్నారు. అందరూ మెచ్చేలా ఆ పార్టీ ఉండాలని అభిప్రాయపడ్డారు. సర్వోదయ తెలంగాణ రావాలని కవిత పేర్కొన్నారు. మేము ఎవ్వరికీ బీ పార్టీ కాము. మాది నంబర్ వన్ పార్టీ అవుతుంది. శ్రీరాముడి స్ఫూర్తితో, సిద్ధాంతాలను ఆదర్శంగా తీసుకుని పని చేస్తాం. ఎక్కడి నుంచి పోటీ చేయాలనేది పార్టీలో చర్చించి నిర్ణయం తీసుకుంటాం. 95 శాతం తెలంగాణ ప్రాంతీయ పార్టీగా, ఇంటి పార్టీగా రాబోతోంది. ప్రజా సమస్యలపై వెంటపడి అడగాలి. ఎంపీ అర్వింద్ మతిమరుపు నాయకుడు. రైల్వే ఓవర్ బ్రిడ్జిల జాప్యానికి నేనే కారణం అన్నారు. ఆయన వచ్చాక ఏం చేస్తున్నారు. అవసరమైతే ఢిల్లీలో లాబీ చేస్తా, గల్లీలో పని చేస్తా' అని కవిత స్పష్టం చేశారు.

## కమనీయం..సీతారామ కళ్యాణం

మొదటిపేజీ తరువాయి

శ్రీరామనవమి సందర్భంగా భద్రాచలంలో శ్రీసీతారాముల కల్యాణోత్సవంఅంగరంగ వైభవంగా జరిగింది. మిథిలా స్టేడియంలోని మండపంలో వేద మంత్రోచ్ఛరణల నడుమ సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. ముందుగా శ్రీసీతారాములను పల్లకిలో ఊరేగింపుగా మండపానికి తీసుకొచ్చారు. శుక్రవారం ఉదయం 10:30 గంటలకు స్వామివారి కల్యాణ ఘట్టం మొదలైంది. అభిజిత్ లగ్నంలో సీతారామయ్యల శిరస్సుపై ఆలయ అర్చకులు జీలకర్ర, బెల్లం పెట్టారు. ఆపై సీతమ్మ మెడలో రామయ్య మాంగళ్యధారణ చేశారు. అనంతరం తలంబ్రాల వేడుక నిర్వహించారు. ఆలయ అర్చకులు ఇతర కార్యక్రమాలను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. భద్రాద్రిలో జరుగుతున్న సీతారామయ్య కల్యాణాన్ని వీక్షించేందుకు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా వివిధ రాష్ట్రాల నుంచి శ్రీరాముని భక్తులు భారీగా తరలివచ్చారు. శ్రీరామ నామస్మరణతో మిథిలా స్టేడియం ప్రాంగణం మార్మోగింది. సీతారాముల కల్యాణం సందర్భంగా మిథిలా స్టేడియంతో పాటు రామయ్య దేవాలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. భక్తులు భారీగా తరలిరావడంతో.. వారికి ఎటువంటి ఇబ్బంది కలగకుండా దేవస్థానం అధికారులు, సిబ్బంది అన్ని ఏర్పాట్లు చేశారు. లక్షల మంది భక్తులు ఆలయానికి చేరుకుని పెళ్లి వేడుకను కనులవిందుగా తిలకించారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొంగలేటి సహా పలువురు ప్రముఖులు వేడుకలో పాల్గొన్నారు. శుక్రవారం ఉదయం బేగంపేట విమానాశ్రయం నుంచి కుటుంబసమేతంగా సారపాక హెలిప్యాడ్‌కు చేరుకున్నారు. అనంతరం రోడ్డుమార్గాన భద్రాద్రి రాములవారి ఆలయం వద్దకు వెళ్లారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున స్వామిఅమ్మవార్ల వివాహ మహోత్సవానికి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. ఉదయం 11:35 నుంచి మధ్యాహ్నం 12:25 వరకు మిథిలా స్టేడియంలో జరిగిన శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం సారపాక హెలిప్యాడ్ నుంచి హైదరాబాద్‌కు తిరిగి బయలుదేరారు.

## సవాళ్ల సమయంలోనే నాయకత్వ పటిమ బయటపడుతుంది:

మొదటిపేజీ తరువాయి

ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్టు చేశారు.

ఇది ప్రజా సంక్షేమ ప్రభుత్వం: లోకేశ్

పెట్రోల్, డీజిల్‌పై సుంకాలు తగ్గించిన ప్రధానికి ఏపీ మంత్రి నారా లోకేశ్ ధన్యవాదాలు తెలిపారు. ప్రజలపై భారం పడకుండా ప్రధాని తీసుకున్న నిర్ణయం అభినందనీయమన్నారు. ఎక్సైజ్ సుంకం లీటర్ పెట్రోల్‌పై రూ.10, డీజిల్‌పై పూర్తిగా రద్దు చేసినట్లు చెప్పారు. ప్రజా సంక్షేమ ప్రభుత్వమని ఎన్డీయే నిరూపించుకుందని అన్నారు.

## వైజాగ్ స్టీల్ ప్రైవేటీకరణ చేసే పరిస్థితులు తలెత్తవు: శ్రీనివాస వర్మ

మొదటిపేజీ తరువాయి



దిల్లీ: విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ, స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియాలో విలీనం చేసే పరిస్థితులు ఉత్పన్నం కావని కేంద్ర ఉక్కుశాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ స్పష్టం చేశారు. శుక్రవారం రాజ్యసభలో వైకాపా ఎంపీ వైవీసుబ్బారెడ్డి అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానం ఇచ్చారు. దేశంలో ప్రభుత్వరంగంలో పనిచేస్తున్న అన్ని స్టీల్‌ప్లాంట్లలో మాదిరిగానే కొన్ని కార్యకలాపాల కోసం కొన్ని ఏజెన్సీల సాయం తీసుకుంటున్నట్లు చెప్పారు. "రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ ఆస్తులన్నింటినీ ఆ సంస్థ శాశ్వత ఉద్యోగులే నిర్వహిస్తున్నారు. కొన్ని కార్యకలాపాల కోసం కొన్ని ఏజెన్సీల నుంచి సాయం తీసుకుంటున్నాం. కేంద్ర ప్రభుత్వ రంగంలోని ఇతర స్టీల్‌ప్లాంట్ల తరహాలోనే ఈ చర్యలు ఉన్నాయి" అని చెప్పారు. ఈ నేపథ్యంలో ఇవి దశలవారీగా ప్లాంట్‌ను ప్రైవేటీకరించడం కిందికి రావని పేర్కొన్నారు.

## బస్సు ప్రమాద బాధితులకు మంత్రుల పరామర్శ

ఒంగోలు రిమ్స్‌కు వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందిస్తామని మంత్రి డీఎస్‌బీవీ స్వామి అన్నారు. క్షతగాత్రుల కుటుంబ సభ్యులతో మాట్లాడామన్నారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని మంత్రి గొట్టిపాటి అన్నారు. రాయవరం వద్ద గురువారం ప్రైవేటు ట్రావెల్స్ బస్సు- కంకర టిప్పర్ లారీ ఢీకొన్న ఘటనలో 14 మంది మృతి చెందిన విషయం తెలిసిందే.

# స్వచ్ఛతే ఆరోగ్య ప్రదాయినీ

**– ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య**

గాయత్రి వార్తలు ఏలూరు జిల్లా ఇంఛార్జి బి ప్రభాకర్

స్వచ్ఛతే ఆరోగ్య ప్రదాయినీ అని, పరిసరాల పరిశుభ్రత అనేది నిరంతర ప్రక్రియ అని ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి పేర్కొన్నారు. ఇందుకు ప్రతీఒక్కరూ తమవంతుగా సహకారం అందించాలని ఆయన సూచించారు. ఏ కార్యక్రమం అయినా బాధ్యతాయుతంగా నిర్వర్తిస్తేనే అనుకున్న ఫలితాలు సాధించగలుగుతామని స్పష్టం చేశారు. కొత్త ఆర్థిక సంవత్సరంలో 10 కోట్ల రూపాయల ప్రత్యేక గ్రాంట్ తో నగరంలోని పలు రహదారులను అభివృద్ధి చేయనున్నట్లు ఎమ్మెల్యే ప్రకటించారు. ఏలూరు 21వ డివిజన్ శాంతినగర్ 13వ రోడ్డు వినాయకుని గుడి వద్ద శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏలూరు ఎమ్మెల్యే, జిల్లా టిడిపి అధ్యక్షులు బడేటి చంటి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సభకు హాజరైనవారందరితో కార్పొరేషన్ కమిషనర్ భానుప్రతాప్ స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఎమ్మెల్యే బడేటి చంటి మాట్లాడుతూ ఎవరికి వారు తమ ఇంటిని ఏ విధంగా శుభ్రంగా ఉంచుకుంటారో,,, అదేవిధంగా పరిసరాలను కూడా ఉంచాలన్న స్ఫూర్తితో ముందడుగు వేస్తే స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర సాధ్యపడుతుందని పేర్కొన్నారు. ఈ



కార్యక్రమాన్ని మొక్కుబడిగా నిర్వహిస్తే ప్రయోజనం ఉండదని, ప్రతి ఒక్కరూ ప్రత్యేక దృష్టి పెట్టి స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. 21 డివిజన్ లో 3వ రోడ్డు నిర్మించాలని స్థానిక ప్రజలు ఎప్పటినుంచో కోరుతున్నారని, 15వ ఆర్థిక సంఘం నిధులతో ఈ రోడ్డును చేపడుతున్నట్లు ప్రజల హర్షధ్వానాల మధ్య ఆయన ప్రకటించారు. అలాగే ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో జరిగిన జిల్లా సమీక్షా సమావేశంలో రోడ్ల పరిస్థితిని ఆయన దృష్టికి తీసుకువెళ్లి ప్రత్యేకంగా 10 కోట్ల రూపాయలు స్పెషల్ ఫండ్ గా ఇవ్వాలని కోరిన వెంటనే ఆయన మంజూరు చేయడం జరిగిందని చెప్పారు. కొత్త ఏడాది ఈ నిధులతో పనులు చేపట్టి మరిన్ని రోడ్లను అభివృద్ధి చేయనున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యంగా ఎక్కువ కాలం మన్నే సీసీ రోడ్లకు ఏలూరు నగరంలో ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. అలాగే నగరంలోని డ్రైన్ లను అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వ నిధులతో చర్యలు తీసుకుంటున్నామని, వచ్చే డిసెంబర్ నాటికి ఈ పనులు ప్రారంభించి త్వరితగతిన పూర్తి చేస్తామని ఎమ్మెల్యే బడేటి చంటి తెలిపారు. అనంతరం పారిశుద్ధ్య నిర్వహణలో అంకితభావంతో విధులు నిర్వర్తించిన ముగ్గురు పారిశుద్ధ్య కార్మికులకు ఎమ్మెల్యే బడేటి చంటి తన సొంత నిధులతో సమకూర్చిన బహుమతులను అందజేశారు. తొలుత డివిజన్ పరిధిలో ఎమ్మెల్యే బడేటి చంటి మొక్కలు నాటారు. అనంతరం వినాయకుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మామిళ్ళపల్లి పార్థసారథి, ఈడా చైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్, డిప్యూటీ మేయర్ కర్రీ శ్రీనివాసరావు,కో ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, కార్పొరేటర్ అన్నపనేని రవికుమార్, క్లస్టర్ ఇంచార్జ్ ఆర్ఎన్ఆర్ నాగేశ్వరరావు, క్లస్టర్ కో ఇంచార్జ్ ఆర్ఎన్ఆర్ రాజేశ్వరరావు, డివిజన్ ఇంచార్జిలు కొండే రాణి నిర్మల కుమారి, అట్లూరి రామకృష్ణ, డివిజన్ కో ఇన్చార్జిలు మద్దు ప్రసాద్, కేతినిడి కిషోర్, బిఎస్ఎన్ఎల్ అడ్వైజరీ బోర్డ్ డైరెక్టర్ లంకపల్లి మాణిక్యాలరావు, తెలుగుదేశం పార్టీ నాయకులు పూజారి నిరంజన్, ముళ్ళపూడి అశోక్, వేల్పుల అరుణ,సతీష్, చందు, బిజెపి నాయకులు నడపన భాస్కరరావు మరియు వివిధ హోదాలలో ఉన్న కూటమి పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సిఎస్ఆర్ నిధులు గ్రామీణ ప్రజలకు మొదటి ప్రాధాన్యత

**– సిఎస్ఆర్ నిధులతో రూ 8 లక్షలు విలువ చేసే మహీంద్రా ట్రాక్టరును జిల్లా కలెక్టరు అందించిన గోద్రెజ్ సంస్థ ప్రతినిధులు**

గాయత్రి వార్తలు ఏలూరు జిల్లా ఇంఛార్జి బి ప్రభాకర్

కలెక్టరేట్ ప్రాంగణంలో శనివారం సిఎస్ఆర్ నిధులతో రూ 8 లక్షలు విలువ చేసే మహీంద్రా ట్రాక్టరును గోద్రెజ్ సంస్థ ప్రతినిధులు శనివారం జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వికి అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ సిఎస్ఆర్ నిధులు గ్రామీణ ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలకు మొదటి ప్రాధాన్యను ఇవ్వాలని అన్నారు. గ్రామీణ అభివృద్ధికి, శానిటేషన్ పనుల్లో యంత్రాలు వినియోగం కీలకమని పేర్కొన్నారు. ట్రాక్టరు ద్వారా గ్రామంలో శానిటేషన్, రోడ్ల మరమ్మతులు, మురుగు తొలగింపు వంటిపనులు వేగవంతంగా నిర్వహించవచ్చునని తెలిపారు. గ్రామ పంచాయతీ అభివృద్ధికి సిఎస్ఆర్ నిధులు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని, ఈ ట్రాక్టరును గ్రామీణ ప్రజలు పారిశుద్ధ్య అవసరాలకు సమర్ధవంతంగా వినియోగించుకోవాలని జిల్లా పంచాయతీ అధికారికి సూచించి, డిపిఓ కి ట్రాక్టర్ ను కలెక్టర్ అందజేశారు. సీఎస్ఆర్ నిధుల నుండి ట్రాక్టర్ ను అందించిన గోద్రెజ్ సంస్థను ఈ సందర్భంగా కలెక్టర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్చి రెవిన్యూ అధికారి కె.భాస్కర్, జిల్లా పంచాయతీ అధికారి కె.అనురాధ, జిల్లా సిపివో యస్.శ్రీదేవి, ఏవో యన్.వి.నాంచారయ్య, గోద్రెజ్ సంస్థ హెచ్ ఆర్ హెడ్ యస్.సంపదరావు, తదితరులు పాల్గొన్నారు.



# రైతుల త్యాగాలకు నిలువెత్తు నిదర్శనమే ఈ అమరావతి !

శ్రీకాళహస్తి, మార్చి 28, గాయత్రి వార్తలు : రిపోర్టర్ : మునిరత్నం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి తెలంగాణా విడివడి ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తరువాత ఏపీకి రాజధానిగా ఎంపిక చేసిన అమరావతి నిర్మాణం కొరకు భూములు ఇచ్చిన రైతుల త్యాగానికి చిహ్నమే 'అమరావతి' అని తంగేళ్ళ పాలెం పిఏసియస్ ఛైర్మన్ బీమాల భాస్కర్ మరియు తెలుగుదేశం పార్టీ,బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.యం.ఉమేష్ రావు కొనియాడారు. రాష్ట్ర విభజన జరిగిన నాటి నుంచి రాజధాని విషయంలో కొనసాగుతున్న అస్పష్టతను శాశ్వతంగా తొలగిస్తూ..ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి శాశ్వత చట్టబద్ధత కల్పిస్తూ ఈరోజు అసెంబ్లీలో చారిత్రాత్మక తీర్మానం చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. జగన్ రెడ్డి లాంటి తుగ్లక్ పాలకులు వచ్చి రాజధాని విషయంలో ఎన్ని పిచ్చి ప్రయత్నాలు చేసినా ఏపీ రాజధానిగా అమరావతి



మాత్రమే ఉంటుందని, అందుకు అవసరమైన చట్టబద్ధత కల్పిస్తూ అమరావతిని ఏపీ శాశ్వత రాజధానిగా నిలబెట్టే దిశగా చారిత్రాత్మక అడుగు పడినందుకు తమ భూములను త్యాగం చేసిన రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారని, ఇకపై మీ రాజధాని ఏది అని అడిగితే మా రాజధాని అమరావతి అని ప్రతీ ఆంధ్రుడు సగర్వంగా చెప్పుకోవచ్చని హర్షం వ్యక్తం చేశారు. జగన్ రెడ్డి కక్ష పూరిత రాజకీయాలకు బలైన ప్రజా రాజధాని – మన అమరావతికి పునరుజ్జీవన ప్రక్రియ తేవడానికి ఎన్డీయే కూటమి అధికారంలోకి వస్తూనే రూ.58 వేల కోట్లతో పనులు ప్రారంభించి అమరావతికి మళ్లీ వెలుగులు తీసుకొచ్చారు. అమరావతి కేవలం ఒక నగరం కాదని, అది ఆంధ్రుల ఆత్మగౌరవ చిహ్నం అని, అమరావతికి లభించిన ఈ గౌరవం యావత్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికే గర్వకారణం అని కొనియాడారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి డా.జి.దశరథాచారి,వన్నెకుల క్షత్రియ సంక్షేమం మరియు అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల్ రవి,గిరిజన సలహా మండలి సభ్యులు యం.సుబ్బయ్య, బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.యం.ఉమేష్ రావు,తంగేళ్ళ పాలెం పిఏసియస్ ఛైర్మన్ బీమాల భాస్కర్ ముదిరాజ్, శ్రీకాళహస్తి పట్టణ కార్యనిర్వాహక కార్యదర్శి వజ్రం కిషోర్, నాయీ బ్రాహ్మణ సాధికార సమితి తిరుపతి పార్లమెంటు సోషల్ మీడియా కన్వీనర్ కోట చంద్రశేఖర్,తిరుపతి పార్లమెంటు నాయకుడు గంగనపల్లి రమేష్,సులేమాన్ తదితరులు పాల్గొన్నారు.

# వర్జీనియా పొగాకుకు గిట్టుబాటు ధర కల్పించాలి.

**ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్.**

గాయత్రి వార్తలు ఏలూరు జిల్లా ఇంఛార్జి బి ప్రభాకర్

వర్జీనియా పొగాకుకు గిట్టుబాటు ధర కల్పించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శనివారం జంగారెడ్డిగూడెం ప్రజాసంఘాల కార్యాలయంలో రైతు సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ఈనెల 25 నుండి వర్జీనియా పొగాకు కొనుగోళ్లు ప్రారంభమయ్యాయని, అయితే ప్రారంభ ధర కిలోకు రూ. 265 నిర్ణయించడం వలన గత ఏడాది కంటే రూ.30 తక్కువకు కొనుగోలు ప్రారంభించడం అన్యాయమని విమర్శించారు. ఈ సంవత్సరం రైతులు నాణ్యమైన పొగాకు పండించారని తగిన ధర లేకపోతే నష్టపోతారని ఆందోళన వ్యక్తం చేశారు. పెట్టుబడి ఖర్చులు కూడా పెరిగాయని చెప్పారు. కిలో పొగాకు సరాసరి ధర రూ.360 వచ్చేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. పొగాకు రైతుకు పొగ పెట్టే ఆలోచనలు కంపెనీలు విరమించుకోవాలన్నారు.పొగాకు బోర్డు,కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే జోక్యం చేసుకొని పొగాకు రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించేలా చర్యలు చేపట్టకపోతే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మండల కార్యదర్శి బొడ్డు రాంబాబు,మండల ఉపాధ్యక్షులు బోడిక రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.



# విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యం

**– సంక్షేమ వసతి గృహాలలో సేంద్రియ పద్ధతిలో పండించిన కూరగాయలు వినియోగం**

**– సేంద్రియ పద్ధతిలో కూరగాయల సాగు వేగవంతం చేయాలి**

**– పెదపాడు మండలంలోని పలు సంక్షేమ వసతి గృహాలను ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి**

గాయత్రి వార్తలు ఏలూరు జిల్లా ఇంఛార్జి బి ప్రభాకర్

జిల్లాలోని ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలలో సేంద్రియ పద్ధతిలో కూరగాయల సాగు పనులు వేగవంతం చేయాలనీ జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. పెదపాడు మండలం వట్లూరు లోని వెనుకబడిన తరగతుల బాలికల వసతి గృహం మరియు బాలుర వసతి గృహం, వట్లూరులోని పిఎం శ్రీ డా.బి.ఆర్.అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలను కలెక్టర్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేసి, వసతి గృహాల పరిసరాలు, వంట తయారీ ప్రాంతంలో పరిశుభ్రత, ఆహార తయారీ సరుకుల నాణ్యతలను అధికారులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. నంతరం వట్లూరు గురుకుల పాఠశాలలో అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో సంక్షేమ వసతి గృహాలలో విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు రసాయనాలు లేని సేంద్రియ విధానంలో పండించిన కూరగాయలు అందించాలన్నది ప్రభుత్వ లక్ష్యమన్నారు. అందుకు అనుగుణంగా జిల్లాలోని అన్ని ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలలో అందుబాటులో ఉన్న స్థలంలో ప్రకృతి సాగు విధానంలో కూరగాయలు పండించేందుకు అనువైన ప్రదేశాన్ని గుర్తించి, కూరగాయలు మొక్కలు పెంపకంనకు అనువుగా తీర్చిదిద్దాలన్నారు. విద్యార్థినీ, విద్యార్థులకు ఆహారంలో వండేందుకు అవసరమైన టమాటా, వంగ, బెండ, దొండ, బీర, దోశ , మునగ, బీన్స్, అరటి, ఆనప, తోటకూర, పాలకూర, బచ్చలి, మెంతికూర, తదితర మొక్కలతోపాటు, పండ్ల రకాలైన అరటి, జామ ,బొప్పాయి కూడా పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. మొక్కలు పెంచేందుకు అవసరమైన విత్తనాలు, మొక్కలను వ్యవసాయ, ఉద్యానవనాలు శాఖ అధికారులు అందించాలని, ఆయా గ్రామంలో ప్రకృతి సేద్యంలో అనుభవమున్న రైతుల సహకారంతో కూరగాయల సాగు చేయాలనీ కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ భాషా , ఉద్యానవనాలు శాఖ అధికారి సాజా నాయక్, ఎంఐపి ప్రాజెక్ట్ అధికారి రామ్మోహన్, జిల్లా వెనుకబడిన తరగతుల అధికారి ఆర్.వి. నాగరాణి, సాంఘిక సంక్షేమాధికారి విశ్వమోహన్ రెడ్డి, ఇంచార్జ్ డిసిఓ భారతి, గురుకులం ప్రిన్సిపాల్ ఝాన్సీ రాణి,





తహసీల్దార్ కృష్ణజ్యోతి, ఎంపిడిఓ జమ, తదితరులు పాల్గొన్నారు.అనంతరం వసతి గృహాలలో విద్యార్థిని, విద్యార్థులను కలిసి వారి సమస్యలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. వసతి గృహంలో ఆహారం నాణ్యత, మెనూ ప్రకారమే ఆహారం అందిస్తున్నారా ? లేదా ? అని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా గురుకులం ఆవరణలో జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి మొక్కను నాటారు .

# ఘనంగా శ్రీ పుట్టపర్తి నారాయణాచార్యులు జయంతి వేడుకలు

**– భారతీయ సాంప్రదాయ సాహిత్యాన్ని సంరక్షించి, అభివృద్ధి చేసిన గొప్ప మేధావి**

**– జిల్లా జాయింటు కలెక్టరు డా.యం.జె.అభిషేక్ గౌడ**

గాయత్రి వార్తలు ఏలూరు జిల్లా ఇంఛార్జి బి ప్రభాకర్

జిల్లా కలెక్టరేట్ గౌతమీ సమావేశ మందిరంలో శనివారం శ్రీ పుట్టపర్తి నారాయణాచార్యులు చిత్రపటానికి జిల్లా జాయింటు కలెక్టరు యం.జె.అభిషేక్ గౌడ పూలమాలలు వేసి, జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా జాయింటు కలెక్టరు యం.జె.అభిషేక్ గౌడ మాట్లాడుతూ శ్రీ పుట్టపర్తి నారాయణాచార్యులు ప్రసిద్ధ తెలుగు పండితులు,కవి, సాహితీ వేత్త,సంస్కృతం, తెలుగు సాహిత్యంపై ఆయనకు లోతైన పరిజ్ఞానం ఉందని, ఆయన జీవితం స్ఫూర్తిదాయకమని అన్నారు. ఉపాధ్యాయుడిగా, రచయితగా, అనువాదకుడిగా పనిచేసి సమాజానికి మంచి సేవలు అందించారని అన్నారు. ఆయన రచనల్లో కవిత్వం, వ్యాసాలు, సంస్కృత గ్రంథాలు, అనువాదాలు ఉన్నాయని అవి ఎంతో ప్రాచుర్యం పొందాయని అన్నారు. తెలుగు, సంస్కృతం, కన్నడ, తమిళం, హింధీ, ఇంగ్లీషు ఆయన బహుభాషా పండితుడని అన్నారు. శాస్త్రీయ సాహిత్యంలో నిపుణుడని తెలుగు సంస్కృతి, సాహిత్యాన్ని ప్రోత్సహించడంలో కీలక పాత్ర పోషించారని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యంగా భారతీయ సాంప్రదాయ సాహిత్యాన్ని సంరక్షించి, అభివృద్ధి చేసిన శ్రీ పుట్టపర్తి నారాయణాచార్యులు గొప్ప మేధావిగా గుర్తింపు పొందారని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఇంచార్చి రెవిన్యూ అధికారి కె.భాస్కర్, జిల్లా బిసి కార్పొరేషన్ ఇడి యన్.పుష్పలత, జిల్లా టూరిజం శాఖ మేనేజరు యస్.పట్టాభిరామన్న, ఏవో యన్.వి.నాంచారయ్య, ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.



# వృద్ధురాలి ఇల్లు సమస్యపై వినుత కోటా స్పందన

శ్రీకాళహస్తి, మార్చి 28, గాయత్రి వార్తలు: రిపోర్టర్: మునిరత్నం

శ్రీకాళహస్తి పట్టణంలోని పానగల్--ఊరందూరు ఆర్చ్ సమీపంలో నివసిస్తున్న గుణభూషణమ్మ (80) ఇంటి సమస్యపై కోటా వినుత స్వయంగా వెళ్లి పరిశీలించి కుటుంబానికి ధైర్యం చెప్పారు. గత కొన్ని సంవత్సరాలుగా ఇల్లు దెబ్బతినడంతో మరమ్మతులకు అనుమతి కోసం పలుమార్లు మునిసిపల్ అధికారులను సంప్రదించినప్పటికీ అనుమతి ఇవ్వలేదని, అలాగే బెదిరింపులు ఎదురవుతున్నాయని గుణభూషనమ్మ ఆరోపించారు. ఈ విషయంపై స్పందించిన వినుత కోటా మాట్లాడుతూ, చట్టపరంగా ఎవరూ ఇల్లు కూల్చే హక్కు లేదని స్పష్టం చేశారు. తక్షణమే అనుమతి ఇవ్వకపోతే ఉన్నతాధికారులు, ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకునేలా చూస్తామని హెచ్చరించారు.





# కేంద్ర ప్రభుత్వ నిధులతో అభివృద్ధి పనులు పూర్తిచెయ్యాలి

**– మిగిలి ఉన్న నిధులు వెచ్చించకపోతే, వచ్చే ఆర్థిక సంవత్సరంలో నిధులు సక్రమంగా మంజూరు కావు**
**– ఏప్రిల్ 02 తేదీన జరిగే డిఆర్ సి సమావేశమునకు నియోజక వర్గాలు,శాఖలు వారీగా పూర్తిస్థాయి నివేదికలు 30 వ తేదీకి అందించాలి**
**– జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి**
**...**

గాయత్రి వార్తలు ఏలూరు జిల్లా ఇంఛార్జి బి ప్రభాకర్





జిల్లా కలెక్టరేట్ గౌతమీ సమావేశ మందిరంలో శనివారం సాయంత్రం కేంద్ర ప్రభుత్వ ద్వారా మంజూరు అయిన 30 స్కీములుపై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. శాఖలు వారీగా కేంద్ర ప్రభుత్వం నుండి మంజూరైన నిధులు, ఇప్పుడు వరకు చేసిన ఖర్చు, మిగిలి ఉన్న నిధులు అడిగి తెలుసుకుని అవి పూర్తిస్థాయిలో పనులు పూర్తి చెయ్యాలని జిల్లా కలెక్టరు సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ద్వారా నిధులు మంజూరు అయిన వివిధ అభివృద్ధి పనులు వేగవంతం చేసి, మిగిలి ఉన్న నిధులకు సంబంధించి పనులను పూర్తి చెయ్యాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఏప్రిల్ 02 తేదీన జరిగే డిఆర్ సి సమావేశమునకు నియోజక వర్గాలు, శాఖలు వారీగా పూర్తిస్థాయి నివేదికలు 30 వ తేదీ నాటికి అందించాలని ఆదేశించారు. సిఎస్ఎస్ మిగిలి ఉన్న నిధులకు సంబంధించి పనులు పూర్తి చేయలేకపోతే వచ్చే ఆర్థిక సంవత్సరంలో నిధులు సక్రమంగా మంజూరు కావని స్పష్టం చేశారు. పట్టణ, గ్రామీణ ప్రజలకు నేరుగా లాభం చేకూర్చే కేంద్ర ప్రభుత్వ పథకాలు ఏవి పెండింగులో ఉండకూడదని, ప్రతి శాఖ తమకు వచ్చిన నిధులు పూర్తిస్థాయిలో వినియోగించాలని అన్నారు. కేటాయించిన అభివృద్ధి పనులు గడువులోగా పూర్తి చేసి, అభివృద్ధి పనులు ప్రజలకు వాడుకలోకి తేవాలన్నారు. ముఖ్యంగా గ్రామీణాభివృద్ధి, ఉపాధి, గృహనిర్మాణం, తాగునీరు, విద్య, ఆరోగ్యం, ఐసిడియస్, గ్రామీణ రక్షిత మంచినీటి సరఫరా, తదితర శాఖలు సంబంధించిన పథకాలు అమలుపై అధికార్లు ప్రత్యేక దృష్టి సారించాలని, గడువు లోగా లక్ష్యాలు పూర్తిచెయ్యని అధికారులుపై శాఖా పరమైన చర్యలు తప్పవని జిల్లా కలెక్టరు హెచ్చరించారు. ఈ సమావేశంలో ఐటిడిఏ పీవో కె.రాములు నాయక్, జిల్లా వ్యవసాయ శాఖ జెడి షేక్ హబీబ్ భాష, జిల్లా గృహనిర్మాణ శాఖ డిడి జి.సత్యనారాయణ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.యు.శోభ, ఆర్డబ్ల్యూఎస్ అధికారి జి.హరినాధ బాబు, ఏపి యంఐపి పిడి డా.యస్.రామ్మోహన్,జిల్లా ఉద్యానవన శాఖ అధికారి కె.షాజానాయక్, జిల్లా మత్స్య శాఖ డిడి బి.రాజ్ కుమార్, డిఆర్డిఏ పిడి టి.వి.విజయలక్ష్మి, జిల్లా విద్యాశాఖ అధికారి యం.వెంకటలక్ష్మమ్మ, సర్వశిక్ష అభియాన్ ఎపిడి పంకజ్ కుమార్, ఐసిడి యస్ పిడి పి.శారద, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# మట్టి అక్రమ తవ్వకాలు, రవాణా చేస్తే కేసులు నమోదు చేయండి

**– ఇరిగేషన్, రెవిన్యూ, పోలీసు సిబ్బందితో బృందాలను ఏర్పాటుచేసి పటిష్టమైన నిఘా పెట్టాలి**
**– మట్టి అక్రమ తవ్వకాలు, రవాణా నియంత్రణపై అధికారులతో జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష**

గాయత్రి వార్తలు ఏలూరు జిల్లా ఇంఛార్జి బి ప్రభాకర్



జిల్లాలో మట్టి అక్రమ తవ్వకాలు, రవాణా చేసే వారిపై కేసులు నమోదు చేయాలనీ జిల్లా కె. వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ నుండి శనివారం జిల్లాలో మట్టి అక్రమ త్రవ్వకాలు, రవాణా నియంత్రణపై అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ జిలాల్లో కాలువలు, చెరువు గట్లు, తదితరాల నుండి అనుమతి లేకుండా మట్టిని అక్రమంగా తవ్వి, రవాణా చేయడం చట్టరీత్యా నేరమని, ఆలా చేసేవారిని ఉపేక్షించేది లేదన్నారు. అక్రమంగా మట్టి తవ్వకాలు కారణంగా కాలువలు, చెరువుల గట్లు బలహీనమవుతాయన్నారు. జిల్లాలో మట్టి అక్రమ తవ్వకాలు, రవాణా నియంత్రణకు ఇరిగేషన్, రెవిన్యూ, పోలీసు అధికారులతో ప్రత్యక బృందాలను ఏర్పాటుచేసి, గట్టి నిఘా పెట్టాలని, ఎవరైనా అనుమతి లేకుండా మట్టిని తవ్వి, రవాణా చేస్తే వారిపై కేసులు నమోదు చేసి వాహనాలను సీజ్ చేయాలన్నారు. రైతులు వారి పొలాలలో అవసరాలకుగాను సంబంధిత తహసీల్దార్ల వద్ద నుండి మే నెలాఖరులోగా అనుమతి తీసుకుని మట్టిని తరలించుకోవచ్చన్నారు. ఇరిగేషన్ శాఖ ఎస్ఈ దేవప్రకాష్, జిల్లాలోని తహసీల్దార్లు, ఇరిగేషన్, గనులు శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ధాన్యం సేకరణ పై జాయింట్ కలెక్టర్ సమావేశం

గాయత్రి వార్తలు ఏలూరు జిల్లా ఇంఛార్జి బి ప్రభాకర్



రబీ పంట కాలానికి సంబంధించి ధాన్యం సేకరణ సన్నాహక సమావేశం శనివారం జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి,సహకార అధికారి, సహకార మార్కెటింగ్ పౌర సంబంధాల అధికారి,పౌరసరఫరాల మేనేజర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, మార్కెటింగ్ అధికారి, జిల్లా రవాణా అధికారులతో సమావేశం నిర్వహించారు. వివిధ విభాగాల సన్నద్ధతను రైస్ మిల్లర్లతో గోనెసంచులు, వాహనాల ఏర్పాట్లపై సమీక్షించి రైతులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ధాన్యం సేకరణ సజావుగా జరపడానికి స్పష్టమైన సూచనలు జారీ చేశారు. జిల్లాలో రాబోవు రబీ సీజన్లో దాదాపుగా లక్ష ఎకరాలలో వరి పంట సాగు చేయబడిందని సుమారుగా మూడు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి కావచ్చు అని,జిల్లాలో సుమారుగా 123 రైతు సేవ కేంద్రాలకు ధాన్యం కొనుగోలు కేంద్రాలను గుర్తించి,కొనుగోలునకు సన్నాహాలు జరపాలని సూచించారు.రబీ సీజన్ కు అవసరమైన 65 లక్షల గోనె సంచుల నాణ్యత తనిఖీ విషయంలోనూ మిల్లర్ల వద్ద నుండి తగిన బ్యాంకు గ్యారంటీ తీసుకోవడంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా పౌర సరఫరాల మేనేజర్ కు ఆదేశాలు ఇవ్వడం జరిగింది. రైతు సేవా కేంద్రాల ద్వారా రైతుల వద్ద నుండి ధాన్యం కొనుగోలు చేయుటకు సిబ్బందిని కొరత లేకుండా నియమించాలని జిల్లా సహకార అధికారిని ఆదేశించారు.జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియకు సంబంధించి గ్రామాలలో, మండలాలలో కమిటీలు ఏర్పాటు చేసి రైతులకు ఎటువంటి సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలని జిల్లా పౌరసరఫరాల మేనేజర్ ను జాయింట్ కలెక్టర్ ఆదేశించడమైనది.

# పారిశుధ్యం పాటించకపోతే చర్యలు

గాయత్రి వార్తలు ఏలూరు జిల్లా ఇంఛార్జి బి ప్రభాకర్



ఏలూరు నగరంలో అపరిశుభ్ర పరిస్థితులు కనపడితే సంబంధిత పారిశుధ్య సిబ్బందిపై చర్యలు తీసుకుంటానని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి హెచ్చరించారు. స్థానిక శాంతినగర్ లో రోడ్లను, డ్రైన్లను శనివారం అధికారులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా రోడ్లపై చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు, డ్రైన్లలో మురుగునీరు నిలిచి ఉండడంతో నగరపాలక సంస్థ అధికారులపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నగరంలో రోడ్లపై ఎక్కడా చెత్త కనిపించకుండా ఉదయం, సాయంత్రం శుభ్రం చేస్తుండాలని , అదేవిధంగా డ్రైన్లలో మురుగునీరు నిల్వ లేకుండా డ్రైన్లలో పూడికతీసి, మురుగునీరు పారేలా చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్డులపై చెత్త, డ్రైన్లలో మురుగు నిల్వ ఉంటె దోమలు వ్యాప్తి చెంది, ప్రజలకు అంటువ్యాధులు ప్రబలుతాయన్నారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛంధ్ర కార్యక్రమం ద్వారా సంపూర్ణ పారిశుధ్యానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతను ఇస్తున్నదన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని అందుకు తగినవిధంగా ఏలూరు నగరాన్ని సంపూర్ణ పారిశుధ్య నగరంగా తీర్చిదిద్దేందుకు నగరపాలక పారిశుధ్య సిబ్బంది పనిచేయాలన్నారు. పారిశుధ్య పనులను తాను ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తానని, పారిశుధ్య విధులలో నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై చర్యలు తీసుకుంటానని కలెక్టర్ వెట్రిసెల్వి హెచ్చరించారు.కలెక్టర్ వెంట ఏలూరు నగరపాలక సంస్థ కమిషనర్ ఏ . భానుప్రతాప్, ఏలూరు తహసీల్దార్ గాయత్రి, నగరపాలక సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రీకాళహస్తీశ్వరుని దర్శించిన ఎమ్మెల్సీ పిడుగు హరి ప్రసాద్

శ్రీకాళహస్తి, మార్చి 28, గాయత్రి వార్తలు:రిపోర్టర్: మునిరత్నం



ఆంధ్రప్రదేశ్ శాసన మండలి సభ్యులు (ఎమ్మెల్సీ), జనసేన పార్టీ మీడియా హెడ్ పిడుగు హరి ప్రసాద్ కుటుంబ సమేతంగా శ్రీకాళహస్తీశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన ఆయనకు స్థానిక జనసేన నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు హరి ప్రసాద్ గారికి, వారి కుటుంబ సభ్యులకు ఆలయ మర్యాదలతో ప్రత్యేక దర్శన సదుపాయం కల్పించారు. స్వామి, అమ్మవార్లను దర్శించుకున్న అనంతరం పండితులు ఆశీర్వచనాలు అందజేసి, తీర్థ ప్రసాదాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు కుమార్, జయప్రకాష్, మహేష్, ఈర్ల చిరంజీవి, లీలదర్, పసుపులేటి నవీన్, రఘు, సుధాకర్ తదితరులు, ఆలయ అధికారులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# శ్రీ పుట్టపర్తి నారాయణాచార్యులు బహుభాషా పండితుడు

**– జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి**

గాయత్రి వార్తలు ఏలూరు జిల్లా ఇంఛార్జి బి ప్రభాకర్



వట్లూరు లోని పిఎం శ్రీ డా.బి.ఆర్. అంబేద్కర్ బాలికల గురుకులంలో శనివారం నిర్వహించిన శ్రీ పుట్టపర్తి నారాయణాచార్యులు జయంతి వేడుకలలో కలెక్టర్ పాల్గొని శ్రీ పుట్టపర్తి నారాయణాచార్యులు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ ?"తెలుగు సాహితీ వనంలో పుట్టపర్తి నారాయణాచార్యులు గారు ఒక ధ్రువతార అని, బహుభాషా పండితుడైన ఆయన 14 భాషల్లో ప్రావీణ్యం సంపాదించి, 'శివతాండవం' వంటి అద్భుత కావ్యాలను అందించిన మహనీయులన్నారు. తెలుగు సాహితీ కారుల్లో అగ్రగణ్యుడుగా నిలిచిన మహాకవి పద్మశ్రీ పుట్టపర్తి నారాయణాచార్యులు అని ఆయన సాహిత్యం మరియు జీవనశైలి నేటి తరానికి ఎంతో స్ఫూర్తిదాయకమని,. అటువంటి గొప్ప వ్యక్తి జయంతిని జరుపుకోవడం మనందరికీ గర్వకారణమన్నారు. సెట్ వెల్ సీఈఓ ప్రభాకర్, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమాధికారి ఆర్.వి. నాగరాణి, జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ భాషా, ఉద్యానవనాలు శాఖాధికారి సాజా నాయక్, ఇంచార్జ్ డిసిఓ భారతి, తహసీల్దార్ కృష్ణజ్యోతి, ఎంపిడిఓ ఏ . జమ, పాఠశాల ప్రిన్సిపాల్ ఝాన్సీ రాణి, ప్రభృతులు పాల్గొన్నారు

# శ్రీకాళహస్తిలో చలివేంద్రం ప్రారంభం

శ్రీకాళహస్తి, మార్చి 28, గాయత్రి వార్తలు: రిపోర్టర్ :మునిరత్నం



శ్రీకాళహస్తి పట్టణంలోని కొత్తపేట సీతాలమ్మ గుడి సమీపంలో చలివేంద్రాన్ని బీఎన్ కండ్రిగ సర్కిల్ ఇన్స్పెక్టర్ తిమ్మయ్య చేతుల మీదుగా ప్రారంభించారు. సీతాలమ్మ భక్త బృందం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ చలివేంద్రంలో ప్రజలకు పుచ్చకాయలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్కిల్ ఇన్స్పెక్టర్ తిమ్మయ్య మాట్లాడుతూ, ఎండాకాలంలో ఉష్ణోగ్రతలు అధికంగా ఉండటంతో ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అలాగే పట్టణంలో మరిన్ని చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సీతాలమ్మ గుడి ప్రెసిడెంట్ పాలమంగళం రవి, ఆర్గనైజర్ అత్తించేరి నాదముని, అశోక్, ప్రకాష్, కత్తి రవి, హేమంత్, సాయన్న, చంద్రారెడ్డి, హరి, వెంకటసుబ్బయ్య, మహేష్ రావు, వెంకటాద్రి నాయుడు, బాల గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

# దేవస్థానం పరువు దెబ్బతీస్తే కఠిన చర్యలు: ఈఓ వెంకటేశ్వర్లు హెచ్చరిక

శ్రీకాళహస్తి, మార్చి 26, గాయత్రి వార్తలు:రిపోర్టర్ : మునిరత్నం



శ్రీకాళహస్తీశ్వరస్వామి వారి దేవస్థానానికి సంబంధించి సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారాలు జరుగుతున్న నేపథ్యంలో భక్తులు అప్రమత్తంగా ఉండాలని దేవస్థానం ఈఓ వెంకటేశ్వర్లు సూచించారు. దేవస్థానం ప్రతిష్టను దెబ్బతీసే విధంగా కొన్ని అసత్య వార్తలు సోషల్ మీడియాలో ప్రసారం అవుతున్నట్లు గుర్తించినట్లు ఆయన తెలిపారు. ఈ క్రమంలో మార్చి 26న ఒక గుర్తు తెలియని మహిళ దేవస్థానం గురించి తప్పుడు సమాచారం ప్రచారం చేసినందుకు, ఆమెపై ఇప్పటికే పోలీసుల ద్వారా కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.దేవస్థానం గురించి ఎవరైనా అసత్య ప్రచారం చేస్తే, భవిష్యత్తులో కూడా కఠిన చర్యలు తీసుకుంటామని ఈఓ స్పష్టం చేశారు. ఇటువంటి చర్యలను దేవస్థానం తీవ్రంగా పరిగణిస్తున్నదని పేర్కొన్నారు.అలాగే, భక్తులు సామాజిక మాధ్యమాల్లో వచ్చే తప్పుడు సమాచారాన్ని నమ్మకూడదని, దేవస్థానం నుండి అధికారికంగా విడుదల చేసే సమాచారాన్నే విశ్వసించాలని సూచించారు. దేవస్థానం గౌరవాన్ని కాపాడేందుకు అందరూ సహకరించాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

**GAYATHRI VARTHALU Publisher, Editor and Owned by Maddineni Nageswara Rao,** SVN Colony, Guntur, Andhra Pradesh - 522006. PRGI Reg No - APTEL/25/A1201 .. Cell No - 7386045673 ..... Printed At SUNDAY PRINTING PRESS, SVN Colony, Guntur, Andhra Pradesh - 522006 ..Cell No - 7386045673.